## 10న పుంజాల శివశంకర్ జయంతి

కాచిగూడ: మాజీ గవర్నర్, జస్టిస్ పుంజాల శివశంకర్ జయంతిని ఈనెల 10వ తేదీన కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు, రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం కాచిగూడలోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. శివశంకర్ జయంతి కార్యక్రమానికి మున్నూరుకాపులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## బీఆర్ఎస్ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కమిటీలు వేయాలి

అంబర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు క్షేత్రస్థాయిలో పార్టీ కమిటీలను వేసే అంశాన్ని పరిశీలించాలని పార్టీ సీనియర్ నేత వెంకట్ రెడ్డి మాజీ మంత్రి హరీష్‌రావును కోరారు. బుధవారం హరీష్‌రావును ఆయన నివాసంలో అంబర్‌పేట బీఆర్ఎస్ నాయకులతో వెంకట్‌రెడ్డి కలిసారు. బుత్‌స్థాయిలో కమిటీలను వెస్తే భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్‌గౌడ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలు ధరించు.. నేతన్నలకు చేయూతనివ్వు



ఆచార్య కొండా లక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి: 'చేనేత వస్త్రాలు ధరించు.. నేతన్నలకు చేయూతనివ్వు'అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పద్మశాలి ప్రజా సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం అశోక్‌నగర్‌లోని ఆచార్యకొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు ఎయిర్‌టెల్ రాజు, పున్న సత్యనారాయణ, మల్లికార్జున, శివకుమార్, మల్ల ప్రశాంత్, వంశీ, తాటిపాముల యాదగిరి, అమర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలి

కవాడిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేవేళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ ఎస్సీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పి. పరశురాం ఆధ్వర్యంలో ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. మాల మాదిగ ఉపకులాలకు చెందిన కార్పొరేషన్లకు రూ.750 కోట్ల నిధులు కేటాయించాలని, ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నగర అధ్యక్షుడు ఎస్. రాజు, నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురాం, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సబ్ ఇన్‌చార్జి మీసాల విఠల్‌రావు, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం రమేష్‌రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, కె. పరిమళ్ కుమార్, మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిలు హాజరయ్యారు.

## హైవోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో హైవోల్టేజ్ విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని పటాన్ బస్తీలో హైఓల్టేజీ సమస్య పరిష్కారానికి , జనావాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ డిఈ కమల్‌కుమార్ శర్మ, ఏఈ సునీల్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జనావాసాలకు ఆనుకోని ఉండడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోట ఏర్పాటు చేయించామన్నారు. అలాగే పటాన్‌బస్తీలో హైఓల్టేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి, జాఫర్, జావిద్‌ఖాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో తిరుగుతున్న వ్యక్తికి జైలు

ముషీరాబాద్: రాంనగర్‌లో కత్తితో తిరుగుతున్న ఓ వ్యక్తిని ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. నాంపల్లిలోని 5వ స్పెషల్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ఆ వ్యక్తికి 30 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు. రాంనగర్ డివిజన్ హరినగర్‌లో నివసిస్తు ఏసీ టెక్నిషియన్‌గా పని చేసే ఎండీ షోహెబ్ కత్తితో అనుమానాస్పందంగా తిరగడాన్ని గమనించారు. వెంటనే బీట్ కానిస్టేబుళ్లు అతడిని పట్టుకొని విచారించారు. గతంలో కూడా షోహెబ్‌పై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసు నమోదై ఉన్నట్లు తెలిపారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం. చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... ఉందానగర్ – జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతలియని వ్యక్తి (30) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి అదృశ్యం

చిక్కడపల్లి: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన ఎస్.వెంకటేశ్ (30) ఇంట్లో ఉంటూ ఆన్‌లైన్ జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం వెంకటేశ్ బయటికి వెళ్లొస్తానని సోదరికి చెప్పి వెళ్లారు. వెంకటేశ్ రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిసాలలో స్వచ్ఛదనం - పచ్చదనంలో పాల్గొన్న కార్పొరేటర్ రవిచారి



విజ్ఞానపురి కాలనీలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కార్పొరేటర్ అమృత



కాచిగూడలో డస్ట్‌బిన్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమా, డీఎంసీ మారుతీదివాకర్



# స్వచ్ఛదనం.. పచ్చదనం



అడిక్‌మెట్‌లోని ఎస్‌బీఐ పక్క వీధిలో చీపురుపట్టి ఊడుస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారులు

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడంతో పాటు తమ చుట్టు పక్కల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని కూరగాయల మార్కెట్, ఎస్‌బీఐ బ్యాంక్ పక్కలైన్, ఎస్ఆర్‌టీ క్వాటర్స్ తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన మట్టి దిబ్బలు, చెత్తాచెదారాన్ని తొలగించి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు.

### ఏఎంహెచ్‌వోపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వారం రోజుల పాటు చేపడుతున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి ఏఎంహెచ్‌వో రాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న డీఎంసీని ఏఎంహెచ్‌వో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. వెంటనే ఎక్కడ ఉన్నా ఇక్కడకు రావాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో ఏఎంహెచ్‌వో హుటాహుటిన కార్యక్రమం వద్దకు వచ్చారు. అధికారులు ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ ఖాదర్, ఏఎంహెచ్‌వో మైత్రి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ముఠా జైసింహ, సురేందర్, కె.మాధవ్, చిట్టి, అస్లాం, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పరిసరాల పరిశుభ్రతను పాటించినప్పుడే ప్రజల ఆరోగ్యాలు మెరుగుపడతాయని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. బుధవారం రిసాల కల్లుకంపౌండ్, పవిత్రనగర్, ఉదయ్‌నగర్‌లలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీహెచ్ఎంసీ కార్మికులతో కలిసి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో మైత్రి, యాసీన్, బాలరాజ్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### నల్లకుంట డివిజన్‌లో అవగాహన ర్యాలీ..

నల్లకుంట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంటలో 'స్వచ్ఛదనం – పచ్చదనం'లో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఈ దివ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, చండీ కేశవరం, ఎస్ఎఫ్ఏ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### భాగస్వాములు కావాలి

కాచిగూడ: స్వచ్ఛదనం.. పచ్చదనంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం కాచిగూడ, చెప్పల్‌బజార్, కుద్బిగూడ తదితర ప్రాంతాల్లో డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలతతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు డస్ట్‌బిన్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు శీర్‌సాగర్, దిలీప్, పంచ్, లావణ్య, తారా, వాసు, బాలప్రసాద్, రాజ్‌కుమార్, నివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలను ధరించి చేయూత ఇవ్వాలి

కాచిగూడ: జాతీయ చేనేత దినోత్సవాన్ని రస్కరించుకొని బుధవారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కందగట్ల స్వామి మాట్లాడుతూ... చేనేత వస్త్రాలను ధరించి చేనేతకు చేయూత ఇవ్వాలన్నారు. చేనేత వృత్తిని రక్షించి నేతన్నలను ఆత్మహత్యల నుంచి కాపాడాలని కోరారు. చేనేత వస్త్రాలు పర్యావరణ అనుకూలమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు అవ్వారి భాస్కర్, కమర్తపు మురళి, చిన్ని రాకేష్, మాచర్ల రాంచందర్, జెల్లా నరేందర్, కటకం రాములు, నాయని సాయితేజ, ఉత్తరపల్లి దయానంద్, గద్దె వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



చేనేత దినోత్సవ ర్యాలీలో అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు

## తల్లిపాలను క్రమం తప్పకుండా ఇవ్వాలి



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ కాచిగూడ సెక్టార్ సూపర్‌వైజర్ కవిత

కాచిగూడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ కాచిగూడ సెక్టార్ సూపర్‌వైజర్ జి.కవిత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం కృష్ణానగర్ బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి మూడేళ్ల పాటు తల్లి పాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. గర్భిణులు, బాలింతతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోషకాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. పోషకాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు. పుట్టిన శిశువుకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్స్ ఉషారాణి, శివరాణి, నయిమున్నీసా, యశోధ, సునిత, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు.

- అహోబిల్ మార్ట్ ఫీడర్ పరిధిలోని ఏటీఐ, బ్యాంక్ కాలనీ, ఆజామ్‌హౌస్, హోటల్ మెనేజ్‌మెంట్ తదితర ప్రాంతాల్లో 10 గంటల నుంచి 11.30 వరకు..
- డీడీ కాలనీ ఫీడర్ పరిధిలోని బతుకమ్మ కుంట, అహోబిల్ మార్ట్ టెంపుల్ లెన్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి ఒంటి గంట వరకు..
- సీతఈకాలనీ ఫీడర్ పరిధిలోని ఆంధ్రాబ్యాంక్, ఎస్‌బీహెచ్ కాలనీ, వి.హనుమంతరావు హౌజ్ తదితర ప్రాంతాల్లో 1.30 నుంచి 3గంటల వరకు..
- సాయిబాబా దేవాలయం ఫీడర్ పరిధిలోని యూనియన్ బ్యాంక్, సాయిబాబానగర్, సీతఈకాలనీ పార్కు తదితర ప్రాంతాల్లో 3గంటల నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

### అన్నదానం

కాచిగూడ: ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. మంహంకాళి ఆలయ ధర్మకర్త రాజేందర్ పటేల్, సుభాష్ పటేల్ ఆధ్వర్యంలో నింబోలిఅడ్డలోని ఆలయం వద్ద అమ్మవారికి ఒడిబియ్యంతో మారుబోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బిల్డర్ ప్రవీణ్, బండ సూరి, కేసరి నర్సింగ్‌యాదవ్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా మల్లికార్జున్

చిక్కడపల్లి: చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా ఎ.మల్లికార్జున్ నియమితులయ్యారు. మేడ్చల్ డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయన చిక్కడపల్లికి బదిలీ అయ్యారు. చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన సతీష్‌కుమార్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా క్రాపా సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లారు. అశోక్ నగర్‌లోని కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## 10న డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కాచిగూడ: హెచ్‌సిఎల్ టెక్–బీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన శనివారం హెచ్‌సీఎల్ హైటెక్ సిటీ ఆఫీసులో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ కిషన్, హెచ్‌సీఎల్ ఏరియా ప్రతినిధి రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు ఫోన్ నం. 90635 64875, 79818 34205.

## దివ్యాంగుల పాదయాత్రకు సంపూర్ణ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగుల సమస్యలపై ఈనెల 9వ తేదీన ప్రహార్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బచ్చుబావుకడు ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రకు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ఆ సంస్థ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఆగస్టు 9న ఉదయం 11 గంటలకు క్రాంతిచౌక్ నుంచి వికలాంగుల కమిషనర్ కార్యాలయం సంభాజీనగర్ వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించనున్నారని తెలిపారు. వికలాంగులకు రూ.6వేల పింఛన్, యాచకులకు ఉండే విధంగా ఇంటి స్థలం, రాజకీయ రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలు తదితర డిమాండ్లపై పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సొసైటీ ఫర్ ది డెఫ్ కన్వీనర్ కాటమోని వెంకటేష్‌గౌడ్, కో–కన్వీనర్ సత్యనారాయణ, గౌస్, ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లో జరిగిన తెలంగాణ రైతు సంఘం శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి శిక్షణ తరగతులు నిరంతరం జరగాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో జాతీయ ఆర్థిక సంక్షోభంపై కూడా చర్చించాలని అన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎక్కువ శాతం నిధులు కేటాయించకుండా రైతు ఉద్యమానికి ఇచ్చిన హామీని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. బీజేపీ దత్త పుత్రులైన అంబాని, అదాని ఆదాయాన్ని పెంచడానికి రూ.16లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. అన్నం పెడుతున్న వ్యవసాయ రంగాన్ని కాపాడడానికి రాష్ట్ర రైతు సంఘం మరింత బలంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, పశ్యపద్మ, ఏపూరి బ్రహ్మం, కంజర భూమయ్య, వీఎస్ ప్రసాద్ శాస్త్రీ, కె.సూర్యానారాయణ, దొండపాడు రమేష్, ప్రభులింగం, కంబాల శ్రీనివాస్, బండ రాజిరెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

## బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనకు చొరవ తీసుకుంటాం

అంబర్‌పేట: అంబర్‌పేటలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణంతో మహంకాళి ఆలయ బొడ్రాయికి వస్తున్న ఇబ్బందులను తొలగించేందుకు అంబర్‌పేట దేవాస్థాన సేవా సమితి చొరవ తీసుకుంటుందని సేవా సమితి సలహాదారులు పి.జ్ఞానేశ్వర్‌గౌడ్ తెలిపారు. బుధవారం దేవాస్థాన సేవా సమితి ప్రతినిధులతో కలిసి ఆయన అంబర్‌పేట గాంధీ విగ్రహం చౌరస్తా వద్ద ఉన్న బొడ్రాయిని పరిశీలించారు. ఇటీవల బోనాల వేడుకల సందర్భంగా భవిష్యవాణిలో బొడ్రాయి స్థలాన్ని మార్చాలని సూచించారన్నారు. అమ్మవారి ఆదేశాల మేరకు అంబర్‌పేట బొడ్రాయిని మారుస్తామని తెలిపారు. ప్రస్తుత బొడ్రాయిపై ఫ్లైఓవర్ వెళ్తుండటంతో దానిపై సూర్యకిరణాలు, వర్షం పడటం లేదన్నారు. అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి త్వరంలో శాస్త్రబద్ధంగా బొడ్రాయిని పునఃప్రతిష్టిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై. శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, గిరిధర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేటలోని బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న దేవాస్థాన సేవా సమితి ప్రతినిధులు

## సీఎం సహాయ నిధి పేదలకు వరం



భోలక్‌పూర్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో వివిధ రోగాలతో బాధపడుతున్న 32 మంది పేదలు మెరుగైన వైద్యం పొందేందుకు 9,16,500 రూపాయల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు వెంటనే నిధులు మంజూరు చేయలని కోరారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు దారుల అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోని ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ నాయకులు రెబ్బరామారావు, మునువర్‌చాంద్, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ ఆలీ, జునేద్ బాగ్దాది, ప్రవీణ్, చాంద్‌పాషా, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ



బాగ్‌అంబర్‌పేట సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో రూ.16లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పార్కులు వంటి అభివృద్ధి పనులను ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపడుతున్నామని అన్నారు. అనంతరం ఆయన పాదయాత్ర నిర్వహించి క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విముక్తి చిరుతల కచ్చి(వీసీకే) తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో బుధవారం 'ఎస్సీ వర్గీకరణ – ఉపకులాల కోటా'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీసీకే తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి బాలసింగం, తెలంగాణ అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ప్రొ. ప్రభంజనం యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను అందరు న్యాయంగా పంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలన్నారు. బహుజన వర్గాలన్నీ రాజ్యాధికారానికి కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. 'మేమెంతో మాకు అంత వాటా దక్కాలి'అని వారు డిమాండ్ చేశారు. రాజ్యాధికారం మన చేతుల్లో ఉంటే వర్గీకరణ సమన్యాయంగా చేసుకోవచ్చునన్నారు. సామాజిక పోరాటాన్ని రాజకీయ పోరాటంగా మలచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సుప్రీంకోర్టు అద్భుతమైన తీర్పు ఇచ్చిందని ఎస్సీ, ఎస్టీ కులాలన్నింటిని చైతన్య పరిచి రిజర్వేషన్ ఫలాలు పొందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కృపాకర్‌మాదిగ, విజయ్ బైన్ల, దాసోజు లలిత, మత్స దేవేందర్, విజయ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



'ఎస్సీ వర్గీకరణ - ఉపకులాల కోటా'అనే అంశంపై జరిగిన సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు